# కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి మంత్రి పొన్నం లేఖ

## రవాణా శాఖలోని పలు అంశాలపై వివరణలు

**హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం లేఖ రాశారు. రవాణా శాఖలోని పలు అంశాలపై కేంద్ర మంత్రికి లేఖ రాసినట్టు తెలిపారు. ప్రభుత్వం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ అండ్ ట్రాఫిక్ రీసెర్చ్ (ఐడిటిఆర్) కోసం ప్రతిపాదనలపై కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ స్పందిస్తూ ఐడిటిఆర్ మార్గదర్శకాల ప్రకారం 2.5 కోట్ల జనాభాకు ఒక ఐడిటిఆర్‌కి మాత్ర మే అర్హత కలిగి ఉంటుందని.. ఇప్పటికే కరీంనగర్‌లో ఐడిటిఆర్ పనిచేస్తుందని తెలిపారు. 3 ప్రాంతీయ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు (ఆర్‌డిటిసిఎస్) డ్రైవింగ్ శిక్షణ కేంద్రం (డిటిఎస్)ల కోసం రాష్ట్రం అర్హత సాధించిందని ఆర్‌డిటిసి అండ్ డిటిసిల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపవచ్చని తెలిపారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం కొత్త ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్స్ స్థాపించడానికి/రిజిస్టర్ చేయ డానికి రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందన్నారు. వాహన్, సారథి సాఫ్ట్‌వేర్‌కి మారడానికి ఎన్ఐసి ధ్రువీకరించిందని తెలిపారు. రాష్ట్రంలో కొత్త వాహన సారధి సాఫ్ట్వేర్ సులభతరం చేయడానికి.. అమలు చేయడానికి ప్రత్యేకంగా టీమ్‌ను నియమించినట్లు మంత్రి పొన్నం తెలిపారు.



# పెండింగ్ బిల్లు పరిష్కారానికి కృషి చేస్తా

## ఆర్అండ్‌బి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ

## మంత్రితో బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధుల భేటీ

**హైదరాబాద్, మార్చి 3,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తో చర్చించి చిన్న కాంట్రాక్టర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లుల సమస్యను పరిష్కరిస్తారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. సోమవారం ఉదయం మంత్రి వెంకటరెడ్డిని బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రితో మాట్లాడుతూ చిన్న కాంట్రాక్టర్లు చేసిన పనులకు సంబంధించి సుమారు రూ. 100 కోట్ల బిల్లులు పెండింగ్ లో ఉండటం వల్ల తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని మంత్రికి విన్నవించారు. పెండింగ్ లో ఉన్న బిల్లులను విడుదల చేస్తే, జరుగుతున్న పనులను పెండింగ్ లో పెట్టకుండా మరింత వేగంగా చేస్తామని మంత్రికి వివరించారు. అంతేకాదు, లెఫ్ట్ వింగ్ ఎఫెక్టెడ్ ఏరియాస్, సిఆర్ఐఎఫ్, నాన్‌ప్లాన్ కింద చేసిన రోడ్లకు సంబంధించిన బిల్లులను కూడా పెండింగ్ లో ఉన్నాయని వాటిని కూడా ఇప్పించేలా చూడాలని వారు మంత్రిని కోరారు.కాంట్రాక్టర్ల సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి త్వరలోనే ముఖ్యమంత్రి తో మాట్లాడి మార్చి చివరి వారంలో బిల్లులు చెల్లించేలా చూస్తానని హామీ ఇచ్చారు. పనుల్లో జ్యాప్యం లేకుండా పనులు చేయాలని మంత్రి ఆదేశించారు.మంత్రిని కలిసిన వారిలో బిల్డర్స్ అసోసియేషన్ మాజీ స్టేట్ చైర్మన్ డి.వి .ఎన్. రెడ్డి, మరో మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, బిల్డర్స్ అసోసియేషన్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, ట్రెజరర్ సంతోష్‌రెడ్డి, సంపత్‌రావు, కృష్ణారావు, తదితరులు ఉన్నారు.




ఎసిబికి పట్టుబడిన నిజామాబాద్ సబ్‌రిజిస్ట్రార్ శ్రీరామరాజు

# ఎసిబికి చిక్కిన నిజామాబాద్ సబ్‌రిజిస్ట్రార్

## రూ.10 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

**హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** ఎసిబి అధికారులకు మరో అవినీతి అధికారి పట్టుబడ్డాడు. ఆయనతోపాటు సమాయకుడుగా వున్న స్వీపర్ కూడా అరెస్టయ్యాడు. నిజామాబాద్ జిల్లా సబ్‌రిజిస్ట్రార్ చెన్నమాధవాని శ్రీరామ రాజు ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం ఓ వ్యక్తిని పదివేల రూపాయల లంచం అడిగాడు. దీనిపై బాధితుడు ఎసిబి అధికారులకు సమాచారం అందించాడు. దీంతో ఎసిబి అధికారులు పక్కాగా నిఘా ఉంచి సోమవారం ఉదయం 11.50 గంటల సమయంలో బాధితుడికి పదివేల రూపాయల డబ్బులు ఇచ్చారు. ఈ డబ్బులను బాధితుడు నేరుగా సబ్‌రిజిస్ట్రార్ చెన్నమాధవాని శ్రీరామరాజుకు ఇచ్చాడు. అనంతరం ఈ డబ్బులను శ్రీరామరాజు తన వద్ద స్వీపర్‌గా పనిచేస్తున్న రంగ్‌సింగ్ వెంకటరావుకు ఇచ్చి దాచమని చెప్పాడు. అతను ఈ నగదు తీసుకుంటున్న సమయంలో అక్కడేవున్న ఎసిబి అధికారులు దాడిచేసి సబ్‌రిజిస్ట్రార్ శ్రీరామరాజుతోపాటు స్వీపర్ వెంకటరావును అరెస్టుచేసి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు శ్రీరామరాజు ఇంట్లోనూ సోదాలు చేసి పత్రాలు జప్తు చేశారు. లంచం తీసుకున్న సబ్ రిజిస్ట్రార్‌ను స్వీపర్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కాగా సర్కారీ విభాగాల్లో అవినీతిపై ప్రజలు 1064కు ఫిర్యాదు చేయాలని ఎసిబి డిజి విజయ్‌కుమార్ కోరారు.

# దేశ వ్యవసాయ వారసత్వంలో చిరుధాన్యాలకు ప్రత్యేక స్థానం

## కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి భగీరథ్‌చౌదరి

## రాజేంద్రనగర్‌లో మిల్లెట్స్ కిసాన్‌మేళా-2025 ప్రారంభం

**హైదరాబాద్ (అత్తాపూర్) మార్చి 3, ప్రభాతవార్త :** దేశ భద్రత, రైతు సంక్షేమం, శాస్త్రీయ అభివృద్ధి అనేవి సమన్వితంగా ఎదగాలని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ సహాయమంత్రి భగీరథ్‌చౌదరి పేర్కొన్నారు. సోమవారం శ్రీఅన్న (మిల్లెట్స్) కోసం వికసిత్ అనే థీమ్‌తో కిసాన్‌మేళా 2025 భారీఎత్తున భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి) రాజేంద్రనగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ రైతులు కోసం ప్రత్యేకంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి భగీరథ్ చౌదరి హాజరై మాట్లాడుతూ.. దేశ భద్రత, రైతు సంక్షేమం, శాస్త్రీయ అభివృద్ధి అనేవి దేశ భవిష్యత్తును మెరుగు పరచడానికి ఈ మూడు ముఖ్యమైన అంశాలని సమర్థంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు (కెవైసి) - రైతుల ఆర్థిక శక్తివృద్ధికి బలమైన ఆయుధమని దేశ వ్యవసాయ వారసత్వంలో చిరుధాన్యా లకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసేందుకు తోడ్పడతాయి. చిరుధాన్యా లను ప్రోత్సహించడం ద్వారా మనం పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య సంరక్షణ, ఆహార భద్రతను సాధించగలు గుతాం. అందుకే, మనం 'చిరు ధాన్యాల కోసం - ఆరోగ్య భారత దేశం' అనే సంకల్పంతో ముందుకు సాగాలని సూచిం చారు. దేశంలోని రైతులకు చిరు ధాన్యాల సాగు గురించి అవగా హన కల్పించేందుకు, ఆధునిక సాంకేతికతలను పరిచయం చేసేందుకు, మార్కెట్ అవ కాశాలను అందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిం చబడు తోందని అన్నారు. మిల్లెట్స్ (చిరుధాన్యాల) ప్రాముఖ్యత కోసం క్లుప్తంగా వివరించారు.



మిల్లెట్స్ కిసాన్‌మేళా సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ సహాయమంత్రి భగీరథ్‌చౌదరి

చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికంగా కలిగి ఉంటాయి, నీటిని తక్కువగా వినియోగించుకుంటాయి, వాతావరణ మార్పులకు తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటాయని సేంద్రీయంగా, తక్కువ పెట్టుబడిలో పండించగలమని పలువురు వివరించారు. ప్రభుత్వం చిరుధాన్యాల ఉత్పత్తికి మద్దతు ఇస్తూ, ధాన్యాల సాగు విధానాలను బలోపేతం చేయడానికి అనేక ప్రణాళికలను రూపొందిస్తోంది. ఐసిఎఆర్- ఐఐఎంఆర్ వంటి సంస్థలు నూతన విత్తన జాతులను, మెరుగైన సాగు విధానాలను అభివృద్ధి చేసి, రైతులకు అందుబాటులోకి తెస్తున్నాయని అన్నారు. అదేవిధంగా పిజెటిఎయు ఉపకులపతి అల్దాస్ జానయ్య, ఎన్ఐఆర్‌డి, పిఆర్ జనరల్ డైరెక్టర్ నరేంద్ర కుమార్,ఎన్ఐ ఎం ఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ సంచుగ్లోరి స్వరూప,ఐసిఎఆర్ ఐఐఓఆర్ డాక్టర్ ఆర్.కె మధుర్, ఐసిఎఆర్-ఎన్ఎంఆర్ఐ డైరెక్టర్ డా. బార్పుద్దేలు పాల్గొని రైతులకు చిరుధాన్యాలపై పలు సూచనలు చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, ప్రభుత్వ అధికారులు, ప్రతినిధులు, స్వయం సహాయ సంఘాలు, రైతులు పాల్గొన్నారు.

# వినికిడి సమస్యను సాంకేతికతతో అధిగమిద్దాం

## ఇఎన్టీ సమస్యలను ఆరోగ్యశ్రీలోకి తెచ్చిందే కాంగ్రెస్ సర్కారు

## వరల్డ్ హియరింగ్ దినోత్సవంలో మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** వినికిడి సమస్యను సాంకేతికతతో అధిగమిద్దామని రాష్ట్ర అటవీ,పర్యావరణ,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.ఒక శబ్ధాన్ని వినగలగడం అనేది భగవంతుడు మన అందరికి ఇచ్చిన గొప్ప వరమని, ఆమె పేర్కొన్నారు. కొన్ని ప్రత్యేక సమస్యలు వల్ల మన సమాజంలోనే కొంతమంది వినికిడి లోపాన్ని కలిగి ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, అటువంటి వారికి మనమంతా అండగా నిలిచి సహకరించాల్సిన అవసరం చాలా ఉందన్నారు.సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ మా ఇ.ఎన్.టి ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ..ఈరోజు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో వినికిడి సమస్య చాలా ప్రధానమైనదని,ఈ సమస్యతో ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా మన దేశంలోనూ ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రపంచ జనాభాలో 5 కంటే ఎక్కువ మందికి (సుమారు 43 కోట్లు) వినికిడి లోపంతో బాధపడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయన్నారు. వినికిడి లోపానికి గల అనేక కారణాలను సరైన జాగ్రత్తతో నివారించవచ్చన్నారు. సకాలంలో, తగిన చికిత్స చేయించుకుంటే ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయవచ్చన్నారు. సరైన చర్యలు తీసుకుంటే బాల్యంలో కనీసం 60 వినికిడి లోపాన్ని నివారించవచ్చన్నారు. ఇ.ఎన్.టి లో 700 పైగా కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడం హర్షణీయం అన్నారు. మానవతా దృక్పథంతో ఆలోచించి ప్రజలకు సేవ చేసే ప్రయత్నానికి ప్రభుత్వ సహకారం ఎప్పుడు ఉంటుదన్నారు అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు.ఈ శస్త్ర చికిత్స విధానం అందరికీ అందాలనే అంశంపై మంత్రివర్గంతో పాటు సందర్భం వచ్చినప్పుడు ముఖ్యమంత్రితో కూడా చర్చిస్తానని ఆరోగ్యశ్రీలో ఈ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని విషయాన్ని ప్రస్తావిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో మా ఈఎన్టీ గ్రూప్ చైర్‌పర్సన్ సునీత కుమార్ ఆసుపత్రి ఎండీ మేఘనాథ్, ఈఎన్టీ ఆసుప్రతి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భర్తతో గొడవలు.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

## కట్నం వేధింపులే కారణమని మృతురాలి తల్లి ఫిర్యాదు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), మార్చి 3, ప్రభాతవార్త:** ఒకే కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తు న్నారు.. పరిచయం ప్రేమగా మారి పెద్దలను ఒప్పించి ఆరు నెలల క్రితం గోవాలో పెళ్లి చేసుకునా న్నరు. నగరంలో కాపురం పెట్టిన ఈ సాఫ్ట్‌వేర్ జంట మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఆదివారం రా త్రి సైతం గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన భార్య గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కాగా కట్నం కోసం వేదింపుల కారణంగానే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మ ృతురాలి తల్లి పోలీసులకు పిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం... వికారాబాద్ జిల్లా తోర్‌మామిడికి చెందిన కమలాపురం దేవిక(25) పూణెలో ఎంబిఏ పూర్తి చేసి నగరంలోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తుంది. ఐఐటి ఖరగ్‌పూర్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన మంచిర్యాలకు చెందిన సద్గుర్తి సతీష్‌చంద్ర దేవిక పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ సంస్థలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత యేడాది ఆగస్టు 23న గోవాలో వివాహం చేసుకున్నారు. ఆదివారం రాత్రి దేవిక, సతీష్‌చంద్రలు ఇంట్లో గొడవ పడ్డారు. శతీష్‌చంద్ర అర్థరాత్రి 12 గంటల తరువాత తిరిగి వచ్చాడు. తెల్లవారుజామున లేచిన శతీష్‌చంద్ర మరోసారి దేవిక తలుపుతట్టినా స్పందించలేదు. ఉదయం పనిమనిషి వచ్చి తలుపుకొట్టినా దేవిక తలుపు తీయలేదు. మరోవైపు ఉదయం 10 గంటలకు దేవిక ఆఫీసుకు వెళ్లాల్సి ఉండగా, అప్పటికీ తలుపు తీయక పోవడంతో అనుమానం వచ్చిన శతీష్‌చంద్ర గది తలుపులు బద్దలుకొట్టి చూడగా, గదిలో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని నిర్జీవంగా కనిపించింది.

# టీచింగ్ హాస్పిటల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

## మంత్రి దామోదర రాజనర్సింహా సమీక్ష

**హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ టీచింగ్ హాస్పిటళ్ల నిర్మాణ పనులపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మంత్రితో పాటు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు. సోమవారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీస్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆర్ అండ్ బి శాఖ అధికారులతో పాటు.. వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. టీచింగ్ హాస్పిటల్స్ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను మంద్రి ఆదేశించారు. పనుల సమయంలో మెడికల్ విద్యార్థు లకు, పేషెంట్లకు ఇబ్బంది కలిగించ కూడదని మంత్రి అధికారులకు, నిర్మాణదారులకు సూచించారు.

# టీచర్ అవమానించడంతో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

## అలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం..

## విద్యార్థినితో ఫోన్‌లో మాట్లాడిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**వికారాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** తోటి విద్యార్థుల ముందు ఉపాధ్యాయురాలు అవమానంగా మాట్లాడిందంటూ ఓ విద్యార్థిని పాఠశాల మొదటి అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మర్పల్లి మండలం, కొత్లాపూర్‌కు చెందిన ముక్కగల్ల తబితా కొత్తగడి బాలికల గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నది. గత నెల 24న విద్యార్థినిని ఉపాధ్యాయురాలు(వైస్ ప్రిన్సిపల్) స్రవంతి తోటి విద్యార్థినుల ముందు అవమానించడంతో పాఠశాల మొదటి అంతస్థుపై నుంచి దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. స్రవంతి మేడం తనను నిందిస్తూ..నీ మొహానికి డాక్టర్ అవుతావా..ఏదో మెడికల్ షాప్ పెట్టుకొని బతుకు అని చిన్నతనంగా మాట్లాడి అందరి ముందు అవమానించిందని విద్యార్థిని ఆవేదన వెలిబుచ్చింది. ఈ కారణంగానే బ్రతుకు పైన విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని బిల్డింగ్ మొదటి అంతస్తు పై నుంచి దూకినట్లు విద్యార్థిని తబిత తెలిపింది. వైద్యానికి రూ.లక్షకుపైనే వైద్య ఖర్చులు అయ్యాయని తల్లిదండ్రులు ముక్కగల్ల యాదయ్య, ముక్కగల్ల రాణెమ్మ కన్నీళ్ల పేర్కొన్నారు. తమ కూతురు ఆత్మహత్యాయత్నం చేసు కోవ డానికి కారణమైన ఉపాధ్యా యురాలు స్రవంతిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థిని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బాధిత విద్యార్థినితో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. ఉపాధ్యాయు రాలిపై చర్యలు తీసుకునేలా సంబంధిత అదికారు లను ఆదేశిస్తానన్నారు.



ఆత్మహత్య యత్నానికి పాల్పడిన విద్యార్థిని తబిత

**విద్యార్థి సంఘాల నాయకుల ఆందోళన..**

విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు గురుకుల పాఠశాల వద్దకు చేరుకుని బాధిత విద్యార్థినికి మద్దతుగా నిలిచి ఆందోళన చేపట్టారు. ఘటనాస్థలానికి పోలీసులు చేరు కుని ఇరువురిని శాంతింపచేశారు. బాధ్యులపై ఫిర్యాదుచేస్తే, వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

# మావోయిస్టు పార్టీకి చెందిన 14 మంది సభ్యులు లొంగుబాటు

## ఎస్పీ రోహిత్‌రాజు

**కొత్తగూడెం క్రైం, మార్చి 3 - ప్రభాతవార్త:** నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చకనే ఆ పార్టీకి చెందిన 14 మంది సభ్యులు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. జిల్లాలోని హేమచంద్రాపురంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లా పోలీసులు, 81 బెటాలియన్, 141 బెటా లియన్ సీఆర్పీఎఫ్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి, ఆపరేషన్ చేయూత కార్యక్రమం ద్వారా లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకొని 14 మంది మావోయిస్టు సభ్యులు ఎస్పీ ఎదుట లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన మడివి బీమా, సోడి ఉంగా, మడివి అడుమ, కుంజాం కోసా, కోవాసి నంద, మడివి బీమా, మడివి మాసా, కుంజాం లక్మా, వెట్టి లక్కే, మడవి చుక్కయ్య, వెట్టి కోసా, మడవి బీమా, సోడి రాధికా, కుహ్రామి కాజల్ ఉన్నారు. ఎస్పీ మాట్లాడుతూ... జిల్లా పోలీసుల ఆద్వర్యంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న వలస ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పోలీసుల ఎదుట లొంగిపోతున్నారని అన్నారు.

# పేదలు కొనుగోలు చేసిన ప్లాట్లను ఫీజు లేకుండా రెగ్యులర్ చేయాలి

## సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

**హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పేదలు కొనుగోలు చేసిన ప్లాట్లను ఎటువంటి ఫీజు లేకుండా రెగ్యులర్ చేయాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోమవారం లేఖ రాశారు. లేఖలో తెలంగాణ రెగ్యులేషన్ ఆఫ్ అన్ అప్రూవ్డ్ అండ్ ఇల్లీగల్ లేఔట్స్ రూల్స్ 2020కి.. జీవో 28 మార్గదర్శకాలను ప్రజలకు సానుకూలంగా ఉండే విధంగా మార్చాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తుదారుడు చెల్లించాల్సిన మొత్తం ఫీజులో 25 శాతం రాయితీని ప్రకటించడంతోపాటు, కొత్తగా ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించడాన్ని స్వాగతిస్తున్నట్టు లేఖలో పేర్కొన్నారు. అదే సందర్భంలో పేదలు కొనుగోలు చేసిన ప్లాట్లను ఎటువంటి ఫీజు లేకుండా రెగ్యులర్ చేయాలని కోరారు.

# ఎసిబికి చిక్కిన బల్దియా డిఇఇ

## రూ.10 వేలు తీసుకుంటూ పట్టుబడిన వైనం

**హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** బల్దియాలో మరో అవినీతి అధికారి ఎసిబికి దొరికిపోయాడు. సోమవారం ఉదయం బల్దియా డివిజన్ 2 కార్యాలయంలో ఈ ఘటన వెలుగు చూసింది. డివిజన్ 2లో క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న దశరథ్ ముదిరాజ్ ఒక ఫైల్ ను క్లియర్ చేసేందుకు ఒక వ్యక్తి నుంచి 20 వేల రూపాయలు లంచం అడిగాడు. ఇందులో భాగంగా మొదట పది వేల రూపాయలు బాధితుడు సదరు అధికారికి ఇవ్వగా మిగతా సొమ్ము పనిపూర్త య్యాక ఇస్తానని చెప్పాడు. అయితే ఇందుకు దశరథ్ ముదిరాజ్ అంగీకరించలేదు. పనిపూర్తయ్యాక డబ్బులు వ్వకుంటే ఎలా అని పది వేల రూపాయలతో పాటు అద నంగా మరో పది వేల రూపాయలు డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు దీనిపై ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేయగా దీనిపై రంగం లో దిగిన ఎసిబి అధికారులు సోమవారం నాడు పక్కాగా వ్యవహరించారు. మధ్యాహ్నం వేళ డివిజన్ 2 కార్యాలయంలో దశరథ్ ముదిరాజ్ బాధితుడి నుంచి 20 వేల రూపాయల లంచం తీసు కుంటుండ గా ఎసిబి అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. అనంతరం లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి నాంపల్లి ఎసిబి కోర్టులో హాజరు పరిచి అనంతరం రిమాండుకు తరలించారు.

# ఆకారంతోపాటు ఆలోచన కూడా పెద్దదిగానే ఉండాలి!

## హరీశ్‌రావుకు ఎమ్మెల్సీ బల్మూరి స్ట్రాంగ్ కౌంటర్

**హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** హరీశ్‌రావు చూడటానికి ఆకారం పెద్దగా ఉంటే సరిపోదు, ఆయన ఆలోచన కూడా పెద్దదిగానే ఉండాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హితవు చెప్పారు.అనుకోని ప్రమా దం జరిగి అందులో ఓ ఎనిమిది మంది కార్మికులు టన్నెల్ లో చిక్కుకున్న ఘటనపై పరిస్థితికి అనుకూలంగా స్పందించాల్సిందిపోయి, హరీష్‌రావు రాజకీయాలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. ప్రతీ విషయంలోనూ హరీశ్ రావు రాజీనామా చేస్తా, రాజీనామా చేస్తా అంటాడే తప్పా రాజీనామా చేయడని ఎద్దేవా చేశారు. ముందు రుణమాఫీ విషయంలో సవాల్ చేసిన హరీష్‌రావు ఎందుకు రాజీనామా చేయలేదు అని నిలదీశారు. రుణమాఫి అంతా కావడంతో తర్వాత ఎలా మాట మార్చారో ప్రజలందరికీ తెలుసు అని ఆయన అన్నారు.

# ఖమ్మంలో మిర్చిబోర్డును ఏర్పాటు చేయాలి

## క్వింటా ఒక్కింటికి రూ.25వేల చొప్పన కొనుగోలు చేయాలి

## అఖిలపక్షం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన

**ఖమ్మం మార్చి 3, ప్రభాతవార్త:** ఖమ్మంలో మిర్చిబోర్డును ఏర్పాటు చేసి క్వింటా ఒక్కింటికి రూ. 25వేల చొప్పున కొనుగోలు చేయాలని అఖిలపక్షం డిమాండ్ చేసింది. పెట్టుబడులు పెరిగిన నేపథ్యంలో రాను రాను ధరను తగ్గిస్తున్నారని అఖిలపక్ష నేతలు ఆరోపించారు. సోమవారం సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్, మాస్లైన్ పార్టీలు అనుబంధ రైతు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. వివిధ పక్షాల నేతలు మాట్లాడుతూ ఖమ్మంలో ప్రధాన పంటల్లో మిర్చి కూడా ఒకటని ఈ ఏడాది అననుకూల వాతావరణ పరిస్థితులు ఇతరత్రా కారణాలతో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయన్నారు. గతేడాది ఇదే సమయంలో క్వింటా రూ. 20వేలకు విక్రయించిన మిర్చి ఇప్పుడు కేవలం రూ.12 వేల నుంచి రూ.13వేల వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని నేతలు ఆరోపించారు. ఖమ్మంలో మిర్చి సాగుకు అనుకూలంగా మిర్చిబోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. క్వింటా రూ.25వేల చొప్పున కొనుగోలు చేసేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని నేతలు తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు మాట్లాడుతూ మిర్చి పంటను ఆహార పంటల జాబితాలో చేర్చి మద్దతు ధరల నిర్ణయాక కమిటీ ద్వారా ప్రతి ఏడాది మిర్చి పంటకు గిట్టుబాటు ధర లభించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# మాకు ఒక్క ఎమ్మెల్సీ స్థానం ఇవ్వండి

## మిత్రధర్మం ఒప్పందాలకు అనుగుణంగా నడుచుకొందాం

## ఎమ్మెల్సీ అవకాశం కోసం గాంధీభవన్‌కు వెళ్లిన సిపిఐ నేతలు

## టిజెఎస్ కూడా ఎమ్మెల్సీ కోసం అంతర్గత ప్రతిపాదనలు



సోమవారం గాంధీభవన్‌లో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌తో సమావేశమైన సిపిఐ నేతలు కూనంనేని, చాడ వెంకటరెడ్డి తదితరులు

**హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కుదుర్చుకున్న మిత్రధర్మ ఒప్పొందాల ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుందని సిపిఐ నేతలు టి కాంగ్రెస్‌పార్టీ చీఫ్ మహేష్ కుమార్‌కు గుర్తుచేశారు. శాసనమండలి ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో సిపిఐ పార్టీకి చెందిన ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కూనంనేని సాంబశివరావు, సిపిఐ నాయకులు చాడవెంకటరెడ్డి తక్కళ్లపల్లి రాజేశ్వరావు, సుదర్శన్, పల్లె నర్సింహా, మాజీ ఎమ్మెల్యే ఆరపల్లి మోహన్ గాంధీభవన్‌లో టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌తో సోమవారం సమా వేశమై 2023 అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సిపిఐకి రెండు ఎమ్మెల్సీలు, ఐదు కార్పొరేషన్ పదవులు ఇస్తామని హామి ఇచ్చిన అంశాన్ని మరోమారు గుర్తుచేయడంతోపాటు ప్రస్తుత ఎన్నికల్లో ఒకటి కేటాయించాలని కోరారు. తెలంగాణ శాసన మండలిలో ఐదు ఎమ్మెల్సీలు ఖాళీ అవు తుండటంతో అందులో నాలుగు స్థానాలను గెలిచేందుకు కావాల్సిన ఎమ్మెల్యేల సంఖ్యాబలం కాంగ్రెస్‌కు ప్రస్తుతం ఉంది. కాంగ్రెస్ పార్టీలో ఐదు సామాజికవర్గాల నుంచి 15 మంది నాయకులు తీవ్రంగా పోటీ పడుతుండటంతో మిత్రులకు అవకాశం ఇస్తారా లేదా అనే అనుమానం కమ్యూని స్టులకు, టిజెఎస్ పార్టీ నేతల్లో నెలకొంది. 2023 అసెంబ్లీ ఎన్నికలల్లో సిపిఐ, టిజెఎస్‌లతో కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకొంది. సిపిఐకి ఒక ఎమ్మెల్యే స్థానం, రెండు ఎమ్మెల్సీ స్థానాలు, ఐదు నామినేటెడ్ పోస్టులు ఇస్తామని హామి ఇచ్చింది. అదేవిధంగా టిజెఎస్‌కు కూడా నామినేటెడ్ పోస్టులతో పాటు రెండు ఎమ్మెల్సీ పోస్టులు ఇస్తా మని ఒప్పందం చేసుకొంది. నామినేటెడ్ పోస్టుల పందేరం జరిగినప్పుడు, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలు ఇస్తున్నప్పుడు మిత్రపక్షాలు వాటి అమలు కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. టిజెఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరామ్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం మొత్తానికి కల్పించారు. సిపిఐకి గవర్నర్ కోటాలో ఇవ్వకపోవడంతో ఇప్పుడు ఎమ్మెల్యే కోటాలో ఒకటి ఇవ్వాలని గాంధీ భవన్‌లో జరిగిన సమావేశంలో గట్టిగా పట్టుపట్టినట్లు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కూడా సిపిఐ ఒక లోకసభ స్థానం కోరింది. బిజెపిని ఓడించాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు రంగంలో ఉండాలని సిపిఐ నాయకులను ఒప్పించడంతోపాటు ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవులు మీకు మిత్రలాభంగా పంపిణీ చేస్తామని బుజ్జగించింది. ఎన్నికలు జరిగాక నామినేటెడ్ పోస్టుల విషయంలో పలు సందర్భాలలలో ముఖ్యమంత్రిని కలిసి హామీల అమలుకు చర్చలు జరుపుతున్నారు. గవర్నర్ కోటాలో ఒకటి ఇస్తారని భావించిన సిపిఐకి నిరాశ కలిగింది. తాజాగా నోటిఫికేషన్ రావడంతో ఎమ్మెల్యే కోటాలో ఒకటి ఇవ్వాలని పిసిసి మహేష్‌కుమార్‌కు విన్నవించారు. అదేవిధంగా జాతీయ సిపిఐ నాయకత్వం కూడా ఎఐసిసి చీఫ్ మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీలను కూడా తెలం గాణలో ఇచ్చిన హామీలు అమలు గుర్తుచేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ మిత్రపక్షంగా ఉన్న టిజెఎస్ కూడా రెండో ఎమ్మెల్సీని కూడా తమ పార్టీకి కేటాయించాలని అంతర్గతంగా ఒత్తిడి తెస్తున్నది. కాంగ్రెస్‌కు మిత్రులైన ఎంఐఎంకు ఒక ఎమ్మెల్సీ స్థానం కేటాయించే అవకాశం ఉందని కాంగ్రెస్ శ్రేణుల నుంచే ఊహాగానాలు వెలువడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలోనే ఎమ్మెల్సీ పదవులు కోరుకునేవారు అత్యధికంగా ఉండటంతో మిత్రపక్షాలకు ఎలా సర్దుబాటు చేస్తుందోనని అందరు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# శ్రీపాల్‌రెడ్డి విజయంతో పిఆర్‌టియు సంబరాలు

**నల్లగొండ ప్రతినిధి, మార్చి 3, ప్రభాతవార్త :** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉత్కంఠగా సాగింది. వరంగల్ ఖమ్మం నల్గొండ నియోజకవర్గాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి పింగళి శ్రీపాల్ రెడ్డి విజయం సాధించారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ, టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిపై ఆయన రెండో ప్రాధాన్యత ఓట్లతో గెలుపొందారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తంగా 24135 ఓట్లుకు గాను 23641 ఓట్లు చెల్లినవిగా అధికారులు గుర్తించారు. దాదాపు 494 ఓట్లు చెల్లనివిగా మిగిలాయి. ఈ స్థానానికి మ్యాజిక్ ఫిగర్ 11821 ఉండగా మొదటి, రెండో ప్రాధాన్యత ఓట్లను కలుపుకుని శ్రీపాల్ రెడ్డికి 6165 ఓట్లు రాగా నర్సిరెడ్డికి 4946 ఓట్లు వచ్చాయి. గెలుపుకు కావల్సింది 11822 ఓట్లు కావడంతో 5657 ఓట్ల దూరంలో శ్రీపాల్ రెడ్డి నిలిచిపోయారు. ఈ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 19 మంది బరిలో ఉండగా 17 మందిని ఎలిమినేట్ చేశారు. రెండో స్థానంలో నిలిచిన సిట్టింగ్ ఎమ్మెల్సీ, టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డికి 8448 ఓట్లు, పీఆర్టీయూ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డికి 11099 ఓట్లు వచ్చాయి. దీంతో సమీప ప్రత్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిపై పింగళి శ్రీపాల్ రెడ్డి 2651 ఓట్లతో గెలుపొందారు. పింగళి శ్రీపాల్ రెడ్డి విజయం సాధించినట్లు ఆర్వో, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారికంగా ప్రకటించింది. ఎన్నిక నియామక పత్రాన్ని అందజేశారు.

ఉదయం 8గంటలకు ప్రారంభమైన ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ రాత్రి 10 గంటల వరకు సుమారు 14గంటలు కొనసాగింది. మొత్తం 18 రౌండ్లలో కొనసాగిన లెక్కింపు పూర్తయింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో దాదాపు 250 మంది సిబ్బంది, మూడు షిఫ్టులలో పాల్గొన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను పోలీసులు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు 530 మంది పోలీసు సిబ్బంది, సీఐలు, ఎస్‌ఐ, ఎస్పీ శరత్ చంద్ర, అడిషనల్ ఎస్పీ మోనిక, డీఎస్పీ శివరాం రెడ్డిలు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలిమినేటెడ్ ప్రక్రియ జరిగిందిలా... ఎవరికి గెలుపుకోటా ఓట్లు రాకపోవడంతో ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టారు. ఎలిమినేటెడ్ లో భాగంగా మొదటి అభ్యర్థి చలిక చంద్రశేఖర్ 1ఓటు, రెండో అభ్యర్థి కంటె సాయన్న 4ఓట్లు, మూడో అభ్యర్థి బంక రాజు 7ఓట్లు, నాలుగో అభ్యర్థి పురుషోత్తం రెడ్డి తలకొల 11ఓట్లు, ఐదో అభ్యర్థి లింగిడి వెంకటేశ్వర్లు 17 ఓట్లు, ఆరో అభ్యర్థి అర్వ స్వాతి 19ఓట్లు, ఏడో అభ్యర్థి గోపాల్ రెడ్డి పన్నాల 24, ఎనిమిదో అభ్యర్థి జంగిటి కైలాసం 26, తొమ్మిదో అభ్యర్థి తాటికొండ వెంకట్ రాజయ్య 36 ఓట్లు, పదో అభ్యర్థి చంద్రమోహన్ ఏలే 100, పదకొండవ అభ్యర్థి జె. శంకర్ 114, పన్నెండవ అభ్యర్థి దామెర బాబురావు 128, పదమూడో అభ్యర్థి డాక్టర్ కొలిపాల వెంకటస్వామి 422, 14వ అభ్యర్థి ఎస్ సుందర్ రాజ్ 2141 ఓట్లు, 15వ అభ్యర్థి పులి సరోత్తం రెడ్డి 2645 ఓట్లు, 16వ అభ్యర్థిగా పూల రవీందర్ 3992 ఓట్లు, 17వ అభ్యర్థిగా గాల్ రెడ్డి హార్షవర్ధన్ రెడ్డి 6034 ఓట్లు సాధించారు.

మిగిలిన ఇద్దరు అభ్యర్థులలో సిట్టింగ్ ఎమ్మెల్సీ, టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి 8448 ఓట్లు, పీఆర్టీయూ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డికి 11099 ఓట్లు వచ్చాయి. దీంతో అలుగుబెల్లి నర్సిరెడ్డిపై పింగిలి శ్రీపాల్ రెడ్డి 2651 ఓట్లతో గెలుపొందారు.



## రాజస్థాన్‌తో 3100 మెగా వాట్ల విద్యుత్‌కు ఒప్పందం

### రాజస్థాన్ సిఎం భజన్‌లాల్, డిసిఎం విక్రమార్క సమక్షంలో ఎంఒయు

**హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** వ్యాపార విస్తరణలో భాగంగా రాజస్థాన్ విద్యుత్ ప్రాజెక్టులపై సింగరేణి ఒప్పందాలు చేసుకుంది. థర్మల్, సోలార్ విద్యుత్ సంబంధించి 3100 మెగా వాట్ల ప్రాజెక్టులు ఈ ఒప్పందంలో ఉన్నాయి. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్‌శర్మ, తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో సోమవారం రాష్ట్ర ఇంధన సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ బలరామ్ ఎంఒయూ చేసుకున్నారు. ఇందులో 26,200 కోట్ల పెట్టుబడితో రాజస్థాన్ విద్యుత్ శాఖ అనుబంధ సంస్థతో కలిసి జాయింట్ వెంచర్ కంపెనీతో 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్, రాజస్థాన్ లో 1500 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పాదనకు అవకాశం కలుగుతుంది. కాగా ఈ ఒప్పందాల్లో భాగంగా మొత్తం వ్యయం, లాభాల్లో 74 శాతం సింగరేణి, 26 రాజస్థాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్‌కు వాటా ఉంటుంది. ఈ ఒప్పందం రెండు రాష్ట్రాల దీర్ఘకాలిక విద్యుత్ డిమాండ్లను తీర్చడానికి ఉపయోగపడుతుంది. ఈ ఒప్పందం వల్ల పగటిపూట సమర్థవంతమైన సౌరశక్తి ద్వారా ఉత్పత్తి ఖర్చులను గణనీయంగా తగ్గించడంతో పాటు, బేస్‌లోడ్ థర్మల్‌విద్యుత్ సామర్థ్యాన్ని పెంచడానికి వీలు కల్పిస్తుంది. ఈ చొరవ తెలంగాణలోని వినియోగదారులకు సరసమైన, నమ్మదగిన మరియు స్థిరమైన విద్యుత్తును అందించడం లక్ష్యంగా ఉన్నట్లు విక్రమార్క ఈ సందర్భంగా అన్నారు. ఇటువంటి వ్యూహాత్మక పొత్తుల ద్వారా దీర్ఘకాలిక ఇంధన భద్రత, ఆర్థిక స్థిరత్వం మరియు పర్యావరణస్థిరత్వాన్ని నిర్ధారించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# కెసిఆర్ బినామీ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

### రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్నది బిజెపి, బిఆర్‌ఎస్‌లే

### కేంద్ర మంత్రులది తెలంగాణ రక్తం అయితే రాష్ట్రానికి రావాల్సిన నిధులు తీసుకురావాలి

### కుల సర్వేలో పాల్గొనని వారికి సర్వే గురించి మాట్లాడే హక్కు లేదు

### రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్‌రూరల్, మార్చి3, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేసీఆర్ బినామి అని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం రోజున మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేసిఆర్ ఆదేశాల మేరకే బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ని తొలగించి కిషన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించి ఆయన చెప్పిన డైరెక్షన్‌లోనే నడుస్తున్నారని ఈ మేరకే తాను రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని తమకు పక్కా సమాచారం ఉందన్నారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి కేంద్ర పదవులు అనుభవిస్తున్న బిజెపి నాయకులది తెలంగాణ రక్తం అయితే రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో వారు కేంద్రాన్ని ఏం అడగటం లేరని అన్న కేంద్రం ఇప్పుడు రావాల్సిన వాటాను ఇవ్వాలని అడిగినా ఎందుకు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలన్నారు. అభివృద్ధికి మేము అడ్డుకాదు అని మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి రావాల్సిన ప్రాజెక్టులు ఎందుకు కార్యరూపం దాల్చడం లేదని చెప్పే దమ్ముందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎయిర్‌పోర్టు కావాలని కనీసం ఒక్క లెటర్ అయినా రాశారా అని విమర్శించారు. కేంద్రం నుండి తెలంగాణకు నిధులు రాబట్టడంలో కిషన్‌రెడ్డి స్ట్రాంగ్ లేదని, తనకు దమ్ము లేకనే ఇతర రాష్ట్రాల మంత్రులను తీసుకొచ్చి ఎయిర్‌పోర్టు తీసుకొచ్చానని గొప్పలు చెప్పించుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కిషన్‌రెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా కలిసి వస్తుందని ఇందులో బిజెపి నాయకులు పెద్దన్న పాత్ర పోషించాలన్నారు. కానీ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు. తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని బిక్షం ఎత్తుకోవడం లేదని హక్కు ప్రకారం తాము చెల్లించిన టాక్స్, జిఎస్‌టి ద్వార తమకు రావాల్సిన వాటాను మాత్రమే అడుగుతున్నామని గుర్తుంచుకోవాలన్నారు. కేంద్రానికి ఇప్పటి వరకు రాష్ట్రం ఏ రకంగా చూసినా అప్పులేదని స్పష్టం చేశారు. ఇక కుల గణన రీ సర్వే విషయానికి వస్తే గత 16వ తేదీ నుండి 28వ తేదీ వరకు రెండవ అవకాశం కల్పించామని ఈ సర్వేలో కేసిఆర్, కేటిఆర్, హరీష్‌రావులు మళ్లీ తమ సమాచారాన్ని ఇవ్వలేరని, ఈ విషయంలో మాట్లాడే నైతిక హక్కు వారికి లేదన్నారు. బిసి రిజర్వేషన్‌ల విషయంలో శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని దానిని తమిళనాడు మాదిరిగా షెడ్యూల్‌లో పెట్టించాల్సిన బాధ్యత బిజెపి నాయకులపైనే ఉందన్నారు. హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌లకు 8లైన్ల రహదారి మంజూరు చేయాలని కేంద్రానికి నివేదించామని ఈ విషయంపై కేంద్రం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదని వెంటనే స్పందించాలని మంత్రి డిమాండ్ చేశారు.

సమావేశంలో మార్కెట్ కమిటి చైర్మెన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ వైస్ చైర్మెన్ బంక చందు, సీనియర్ నాయకులు చిత్తారి రవిందర్, వెన్న రాజు, కోమటి సత్యనారాయణ, అక్కు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## తెలంగాణ అభివృద్ధిని అడ్డుకొంటున్న కేంద్ర బిజెపి మంత్రులు

### బిఆర్‌ఎస్ బిజెపి లోపాయికారీ ఒప్పందంతో సైంధవుడిగా మారిన కిషన్‌రెడ్డి

### టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** తెలంగాణ అభివృద్ధిని అడుగడుగునా బీజేపీ కేంద్ర మంత్రులు అడ్డుకుంటున్నారని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. సోమవారం గాంధీ భవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ బిజేపి బిఆర్‌ఎస్ లోపాయికారీ ఒప్పందం లో భాగంగానే కిషన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి మోకాలడ్డుతున్నారన ఆవేదన చెందారు. ఎన్నికల వరకే రాజకీయాలు, ఎన్నికల తర్వాత రాష్ట్ర అభివృద్ధి ముఖ్యం అనే సోయి లేకుండా తెలంగాణలోని విపక్షాలు వ్యవహరిస్తున్నాయని అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సైందవుడిలా రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమే కాకుండా తెలంగాణపై నిత్యం విషం చిమ్ముతున్నారని దుయ్యబట్టారు. బీజేపీ ఎనిమిది మంది ఎంపీలు తెలం గాణ అభివృద్ధి కోసం ఏనాడైనా ప్రధాని మోదీని కలిసి చర్చించారా అని మహేష్‌కుమార్‌గౌడ్ నిలదీశారు. తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి ఆశిస్తున్న రఘునందన్ రావు పాచికలు పార్టీలో పారకపోవడంతో దిక్కుతోచని స్థితిలో విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీసీ బిడ్డ బండి సంజయ్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించి, అగ్రవర్ణాల వారికి ఇచ్చినప్పుడు రఘునందన్ రావు ఎందుకు మౌనం దాల్చారు? అని ఆయన అడిగారు. కవిత పింక్ బుక్ లో మొదట అందులో వారి పార్టీ నేతల స్కాంల గురించి రాయాలని మహేష్‌కుమార్‌గౌడ్ సూచించారు. విలేఖరుల సమావేశంలో ఎంపీ చామల కిరణ్ కుమార్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, చరణ్ కౌశిక్ యాదవ్‌లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలి

### విద్యా వ్యవస్థ ముఖ-చిత్రం మారాలి

### విద్యాసంస్కరణలపై సమీక్షలో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలని.. తద్వారా పాఠశాల విద్య ముఖచిత్రాన్ని సమూలంగా మార్చాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి శ్రీధర్ బాబు సోమవారం సమీక్ష నిర్వహించారు. సమీక్ష సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, పాఠశాల విద్య డైరక్టర్ ఈవి నరసింహారెడ్డి, అడిషనల్ డైరక్టర్ లింగయ్య, ఓపెన్ స్కూల్ డైరక్టర్ శ్రీహరి పాల్గొన్నారు. ఒకప్పుడు ప్రపంచానికి ప్రతిభావంతులను అందించిన ప్రభుత్వ స్కూళ్లు ఎందువల్లనో ఇప్పుడా పరిస్థితిలో లేవని మంత్రి సమీక్ష సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడలేక పోతున్నామని దానికి దారితీసిన కారణాలపై అధ్యయనం చేసి మార్పులకు శ్రీకారం చుట్టాలన్నారు. స్కూళ్లలో మౌలిక సదుపాయాలు మరింత మెరుగు పర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు కూడా అత్యుత్తమ చదువులను అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారని ఇందుకు అనువైన పరిస్థితులను విద్యాశాఖ కల్పించాలన్నారు. గుజరాత్ నుంచి ఏటా 30 నుంచి 40 మంది ప్రభుత్వ ఉపాధ్యాయాలు సింగపూర్‌కి వెళ్లి ఉన్నత శిక్షణ పొంది వస్తున్నారని. ఆ తరహా ప్రయత్నం మనవద్ద కూడా జరగాలని మంత్రి సూచించారు. ఫిన్లాండ్, ఫ్రాన్స్, యుకెలలోని విద్యాప్రమాణాలపై అధ్యయనం చేసి తెలంగాణలో కూడా ఆ స్థాయి విద్యను ప్రవేశ పెట్టాలని అందకనుగుణంగా పాఠ్యాంశాలను మార్చాలన్నారు. సింగపూర్ ప్రభుత్వం మన దగ్గర ప్రపంచస్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేయడానికి అంగీకరించిందని త్వరలోనే సింగపూర్ బృందం పర్యటిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు తెలిపారు. మన ఉపాధ్యాయులను కూడా ఇతర దేశాలకు పంపించి నైపుణ్యాలను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన విధివిధానాలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రానున్న 23 ఏళ్లలో మన విద్యావిధానంలో సమూల మార్పులు జరగాలన్నారు. విద్యపై ఎంతో ఖర్చు పెడుతున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదన్నారు. ఢిల్లీలోని ప్రభుత్వ స్కూళ్ళను పరిశీలించి అందులో మెరుగైన విధానాలను అమలు చేసే విషయం పరిశీలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సును కరికులమ్‌లో భాగం చేయాలన్నారు. కింది తరగతుల నుంచే విద్యార్థులకు కృత్రిమ మేధ(ఏఐ)పై అవగాహన కల్పించాలని.. హైస్కూలు స్థాయిలో దానిని వినియోగించి తెలివితేటలను పెంచుకునేలా చూడాలన్నారు. భేషజాలకు పోకుండా కన్సల్టెంట్ల సేవలను తీసుకోవాలని.. మన ఆలోచనల కంటే వారి సూచనలు వాస్తవికంగా ఉంటాయన్నారు. ఒకప్పుడు డిఇఓలు తరచూ స్కూళ్లను తనిఖీ చేసేవారన్నారు. ఎంఇఓలు ఇతర పనులు చేస్తున్నారు తప్ప విద్యాప్రమాణాలు పెంచే ప్రయత్నం జరగటం లేదు. స్కూళ్లలో వకృత్వ పోటీలు జరిగేవి విద్యార్థులను పిక్నిక్‌లకు తీసుకెళ్లేవారు, ఎక్సకర్షన్లు ఉండేవని గుర్తు చేశారు. ప్రైవేటు స్కూళ్లలో ఇవన్నీ జరుగుతున్నాయని, వచ్చే తరం పిల్లలకు మనం ప్రపంచస్థాయి విద్యను అందించగలిగితేనే వాళ్ల పోటీ ప్రపంచంలో మనగలగుతారని ఈ విషయాన్ని గుర్తుపెట్టుకొని విద్యలో సమూల మార్పులకు దారి వేయాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు.

## బర్డ్ ఫ్లూతో మటన్ హాలీంకు డిమాండ్

### రూ.300 దాటిన రేటు

**హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** రంజాన్ అనగానే వెంటనే గుర్తొచ్చేది హాలీం. తెలంగాణలో ఆదివారం నుంచి పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. మసీదులను విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. ఉపవాస దీక్షలతో డ్రై ఫ్రూట్స్, పండ్లు ధరలు అమాంతం పెరిగాయి. ఇక రంజాన్ అంటేనే హాలీం కావడంతో రాష్ట్రంలోని వివిధ పట్టణాలు ప్రధానంగా హైదరాబాద్ నగరంలో ప్రతి గల్లీలో హాలీం దుకాణాలు వెలిశాయి. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ భయంతో మటన్ హాలీంకు డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో ధరలు కూడా 200-250 రూపాయల నుండి 300 రూపాయలకు పైగా పెరిగాయి. అయినప్పటికీ, హాలీం ప్రియులు ధర పెరిగినా కూడా వెనకాడటం లేదు. ఉపవాస దీక్షల ముగిసిన తర్వాత హాలీం షాపుల వద్ద హాలీం ప్రియులు క్యూ కడుతున్నారు. అయితే ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ భయం ఉండటంతో చాలా మంది నాన్ వెజ్ ప్రియులు మటన్ హాలీమ్ వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో హాలీంకు భారీ డిమాండ్ పెరిగిందని హాలీమ్ వ్యాపారులు చెబుతున్నారు.

## యాసంగిలో 69.23 లక్షల ఎకరాల్లో సాగు

### 53.25 లక్షల ఎకరాల్లో వరి

**హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రస్తుత యాసంగి సీజనులో ఇప్పటి వరకూ 109 శాతం చొప్పున 69,22,773 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. గత ఏడాది ఇదే సయానికి 63,43,075 ఎకరాల్లో సాగు కాగా, దాని కంటే దాదాపు 6 లక్షల ఎకరాల్లో ఎక్కువ జరిగింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ నివేదికలో వీటి వివరాలను వెల్లడించింది. ఇందులో వరి, మొక్కజొన్న, కంది, మినుము తదితర ఆహార ధాన్యాలే 65,78,713 ఎకరాల్లో, వేరుశెనగ, సన్‌ఫ్లవర్ వంటి ఆయిల్ పంటలు 2,81,411 ఎకరాల్లో సాగయ్యాయి. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకూ సాగైన పంటల్లో అత్యధికంగా వరి 53,24,752 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. గత ఏడాది ఈ సమయానికి 48,30,792 ఎకరాల్లో వేయడం జరిగింది. అలాగే మొక్కజొన్న 7,50,840 ఎకరాల్లోనూ, జొన్నలు 2,12,214 ఎకరాల్లో, శనగలు 2,19,398 ఎకరాల్లో, వేరుశెనగ 2,35,810 ఎకరాల్లో సాగు చేశారు. ఇక రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండజిల్లాలో 5,37,312 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేసి అగ్రస్థానంలో ఉండగా, 5,05,945 ఎకరాలతో నిజామాబాద్ రెండో స్థానంలో, 4,65,992 ఎకరాలతో సూర్యాపేట్ మూడవ స్థానంలో ఉంది.

## రాష్ట్ర జీఎస్టీ 1 శాతం వృద్ధి

**హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర జీఎస్టీ వృద్ధి రేటు 1 శాతంగా నమోదైంది. గత ఏడాది ఫిబ్రవరిలో 10 శాతంగా ఉండగా, ఈ ఏడాది అదే నెలకు కేవలం ఒక శాతం జీఎస్టీ వృద్ధిని మాత్రమే నమోదు చేసింది. జీఎస్టీ వృద్ధి రేటు పరంగా అరుణాచల్ ప్రదేశ్‌తో పాటు, ఇప్పుడు రాష్ట్రం అట్టడుగున ఉంది. జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ రూ.5,280 కోట్లతో 10వ స్థానంలో నిలిచింది. కేంద్రం తాజాగా విడుదల చేసిన డేటా ప్రకారం, త్రిపుర (21 శాతం), హర్యానా (20 శాతం), మధ్యప్రదేశ్ (15 శాతం) వంటి రాష్ట్రాలు దేశంలోనే ముందంజలో ఉన్నాయి. పొరుగున ఉన్న ఆంధ్ర ప్రదేశ్ (4 శాతం), ఛత్తీస్‌గఢ్ (7 శాతం) జిఎస్‌టి వృద్ధి రేటు పరంగా తెలంగాణ కంటే ముందున్నాయి. ఇక రెవెన్యూ వసూళ్ల విషయానికి వస్తే, మహారాష్ట్ర రూ.30,637 కోట్లతో అగ్రస్థానంలో ఉండగా, కర్ణాటక రూ.14,117 కోట్లతో రెండోస్థానంలో ఉంది. అవి వరుసగా 13 శాతం, 10 శాతం వృద్ధి రేటును నమోదు చేశాయి.

## మాయావతి మేనల్లుడిపై పార్టీ బహిష్కరణవేటు

**లక్నో, మార్చి 3:** బిజెపి వ్యవస్థాపక అధ్యక్షురాలిగా తాను బతికున్నంతకాలం పార్టీలో తన రాజకీయ వారసుడంటూ ఎవరూ ఉండబోరని బిఎస్పీ అధినేత్రి మాయావతి ప్రకటించారు. తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌నుపార్టీకి సంబంధించిన అన్ని కీలకపదవులనుంచొ తొలగిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే పార్టీనుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ జారీచేసిన షోకాజ్ నోటీసుకు ఆకాశ్ ఆనంద్ స్పందన స్వార్థంతోనూ, అహంకారపూరితంగాను ఉందని ఆమె విమర్శించారు. పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఉన్న ఆకాశ్‌తండ్రి ఆనంద్‌కుమార్‌తోపాటు రాజ్యసభ సభ్యుడురామ్‌జీ గౌతమ్‌ను బిఎస్పీ జాతీయ సమన్వయకర్తలుగా నియమిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాదికూడా ఒక పర్యాయం ఆకాశ్‌ను బాధ్యతలనుంచి తప్పించి తర్వాత మళ్లీ తన వారసుడిగా ప్రకటించారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకునే తాను బతికుండగా వారసుడి ఊసెత్తనని ప్రకటించారు. లక్నోలో జరిగిన బీఎస్పీ ఆఫీస్ బేరర్ల సమావేశంలో కీలక నిర్ణయాలనుప్రకటించారు. ఈనెల 15న నిర్వహించనునన పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతి వేడుకలకు సంబంధించిన ప్రణాళికలు వివరించారు. తనకు పార్టీయే ముఖ్యమని ఆతర్వాతనే కుటుంబమని అన్నారు. పార్టీ విధానాలకు హానికలిగించేలా తన పేరు ఎవరు దుర్వినియోగంచేసినా వెంటనే తొలగిస్తానన్నారు. బిఎస్పీని రెండు వర్గాలుగా చీల్చి బలహీనపరిచే ప్రయత్నంచేసిన ఆకాశ్‌మామ ఆశోక్‌సిద్ధార్థ్‌ను ఈ నియామకానికి అనుగుణంగా నేగత నెల పార్టీనుంచి బహిష్కరించామని, ఇపుడు మేనల్లుడు ఆకాశ్‌నుసైతం పార్టీ బాధ్యతలనుంచి తప్పిస్తున్నట్లు వివరించారు. ఆకాశ్‌రాజకీయ జీవితంపై ఇప్పటికీ ఆతడి మామ ప్రభావం ఉండటంవల్ల ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తన సోదరుడు ఆనంద్‌కుమార్ పార్టీ నమ్మకాన్ని ఎప్పుడూ వమ్ముకానీయలేదని సమాజ్‌వాదిపార్టీ, బిజెపిలు ఒకే నాణేనికి రెండువైపుల వంటివని మాయావతి నిశిత విమర్శలుచేసారు.

# పాత లేఔట్లలో కబ్జాల జోరు

### హైడ్రా ప్రజావాణికి 49 ఫిర్యాదులు

### అనుమతి లేని హోర్డింగ్‌లను కూల్చేస్తాం

### యాడ్ ఏజెన్సీలకు ఆదివారం వరకు గడువు

### హైడ్రా కమిషనర్ ఎ.వి రంగనాథ్



సోమవారం ఫిర్యాదు కాపీని పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్ తదితరులు

**హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త:** పాత లేఔట్లను చెరిపేసి తమ ప్లాట్లతో పాటు.. ప్రజావసరాలకు ఉద్దేశించిన పార్కులు, రహదారులను కబ్జాచేసేస్తున్నారని పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. 1980-1990 సంవత్సరాల కాలంలో వేసిన లే ఔట్లు మాయం చేసి భూమినంతా తమ ఆధీనంలోకి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 49ఫిర్యాదులందాయి. ఇందులో ఎక్కువగా నగర శివార్లలోని లే ఔట్లకు సంబంధించినవి ఉన్నాయి. భూముల ధరలు పెరగడంతో గతంలో తమకు అమ్మినవారే కొన్ని చోట్ల కబ్జాలు పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. పంచాయతీ లే ఔట్లను వ్యవసాయ భూములుగా మార్చేసి సాగు చేసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామంలో 1980 దశకంలో 2684 ప్లాట్లతో లేఔట్ వేయగా 2024 వచ్చేసరికి అందులో 30 ఎకరాల మేర కబ్జాకు గురైందని పలువురు ఫిర్యాదు చేశారు. ఆ లేఔట్‌లోని పార్కులు, రహదారులు కూడా కబ్జాకు గురయ్యాయని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని దివ్యానగర్ లేఔట్‌లో తాము ప్లాట్లు కొనగా ఇప్పుడవి కనిపించడంలేదని పలువురు ప్లాట్ల యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. 66 ప్లాట్లు గల్లంతయ్యాయని.. ఇప్పుడక్కడ వ్యవసాయం చేస్తున్నారని వాపోయారు. గచ్చిబౌలిలోని గోపన్నపల్లిలోని టీఎన్‌జీవో కాలనీలో ఉద్యోగులకు కేటాయించిన భూములను కొంతమంది టీఎన్‌జీవో ప్రతినిధులుగా పేర్కొని 8 ఎకరాలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేశారని టీఎన్‌జీవో కాలనీ సంక్షేమ సంఘం (గచ్చిబౌలి) ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చెంగిచర్ల గ్రామంలోని శ్రీపురం కాలనీలో పార్కులు, రహదారులు కబ్జాకు గురయ్యాయని.. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఫిర్యాదుదారుల సమక్షంలోనే గూగుల్ మ్యాప్‌లు, సర్వే ఆఫ్ ఇండియా మ్యాపులను పరిశీలించి.. సమగ్ర విచారణకు అధికారులను ఆదేశించడంతో ఫిర్యాదుదారులు సంతోషం వ్యక్తం చేశారు.

**హోర్డింగుల తొలగింపునకు ఆదివారం వరకు గడువు:** అనుమతులు లేని అడ్వర్టైజ్‌మెంట్ హోర్డింగులను తొలగించడానికి ఆదివారం వరకూ ఆయా ఏజెన్సీలకు గడువు ఇస్తున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌గారు తెలిపారు. ఈ లోగా అందరూ స్వయంగా అనుమతి లేని హోర్డింగులను తొలగించుకోవాలని తర్వాత ఉన్న వాటిని హైడ్రా స్వయంగా తొలగిస్తుందని కమిషనర్ స్పష్టం చేశారు.

## ఎపి అసెంబ్లీలో ఎమ్మెల్యేలకు సీట్ల కేటాయింపుపై డిప్యూటీ స్పీకర్ ప్రకటన

**విజయవాడ మార్చి3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఎమ్మెల్యేలకు, మంత్రులకు స్పీకరు చింతకాయల అయ్యన్న పాత్రుడు సీట్లను కేటాయించారు. సభలో జీరో అవర్ జరుగుతున్న సమయంలోఈ మేరకు సీట్ల కేటాయింపుపై డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ప్రకటన చేశారు. ట్రెజరీ బెంచ్‌గా ముందు వరుసలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇతర మంత్రులకు క్రమంలో సీట్లను కేటాయించారు. అనంతరం ప్రభుత్వం చీఫ్ విప్, విప్‌లకు సీట్లను కేటాయించారు. సీనియారిటీ ప్రాతిపదికన ఎమ్మెల్యేలకు సీట్ల కేటాయింపు చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైకాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్షనేత జగన్‌కు ప్రతిపక్ష బెంచీలో ముందు వరుసలో సీటును కేటాయించారు.

## పోసానిపై ఎపిలో 17 కేసులు

### కస్టడీ కోరుతూ కడప కోర్టులో పిటిషన్

**రాజంపేట అర్బన్, మార్చి3 ప్రభాతవార్త:** సినీ నటుడు పోసాని కృష్ణపై రాష్ట్రవ్యాప్తంగా 17 కేసులు నమోదయ్యాయి. ఒకే రోజు మూడు పోలీస్ స్టేషన్‌ల నుంచి పిటి వారెంట్‌తో ఆయన్ను అదుపులోకి తీసుకునేందుకు సోమవారం ప్రయత్నించారు. అయితే జైల్లశాఖ ఉన్నతాధికారులు పల్నాడుజిల్లా నరసరావుపేట పోలీసుల అదుపులోకి ఇవ్వాలని ఆదేశించారు. సోమవారం ఉదయం పోసాని అదుపులోకి తీసుకునేందుకు అనంతపురం, పలనాడు జిల్లా నరసరావుపేట, అల్లూరు జిల్లాకుచెందిన పోలీసులు రాజంపేటకు వచ్చారు. రాజంపేట సబ్ జైలు అధికారి మల్రెడ్డిని సంప్రదించారు. ఆయన ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో నరసరావుపేట పోలీసులు ఆయన అదుపులోకి తీసుకొని తరలించారు. మరోవైపు పోసానిని విచారించేందుకు మూడు రోజుల కస్టడీకి ఇవ్వాలని కడప కోర్టులో ఓబులవారిపల్లి పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. రైల్వే కోడూరు న్యాయమూర్తి సెలవులో ఉండడంతో కడప కోర్టును ఆశ్రయించారు. పోసాని తరఫున న్యాయవాదులు కూడా బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. రెండు పిటిషన్లపై కోర్టు విచారణ బుధవారానికి వాయిదా వేసింది.

## చేతులకు బేడీలతో అసెంబ్లీకి ఎమ్మెల్యే



**ముంబయి, మార్చి 3:** మహారాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు ఒక ఎమ్మెల్యే తన చేతులకు సంకెళ్లతో అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. అమెరికాలోని భారతీయ అక్రమ వలసదారులకు సంకెళ్లువేసి దేశానికి పంపిస్తున్న తీరుపట్ల ఆయన ఈ విధంగా నిరసన తెలిపారు. అయినా కూడా కేంద్ర ప్రభుత్వం అమెరికాపై ఏమీ మాట్లాడటంలేదని విమర్శించారు. మహారాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలుప్రారంభం అయిన సందర్భంలో శరద్‌పవార్ ఎన్సీపీ ఎమ్మెల్యే జితేంద్ర అవధ్ తన చేతులకు బేడీలు వేసుకుని అసెంబ్లీ సమావేశాలకు వచ్చారు. భారతీయ అక్రమ వలసదారుల కాళ్లుచేతులకు సంకెళ్లువేసి అమెరికా సైనిక విమానాల్లో పంపిన చర్యపై ఇలా నిరసన తెలిపినట్లు చెప్పారు. కాగా ఎమ్మెల్యే జితేంద్ర అవధ్‌తన చేతులకు సంకెళ్లతో అసెంబ్లీప్రాంగణంలోని మీడియా పాయింట్‌వద్దకు వచ్చారు. అమెరికాలో భారతీయులు ఎదుర్కొంటున్న అన్యాయం తీరు వారిని బంధించి బహిష్కరిస్తున్న తీరు, వీసా సమస్యల కారణంగా అమెరికాలో ఏభారతీయుడు సురక్షితంగాలేడు. అమెరికా గురించి ప్రభుత్వం ఒక్కమాట కూడా మాట్లడటంలేదని విమర్శించారు. మరోవైపు మహారాష్ట్ర ఎమ్మెల్యే జితేంద్ర అవద్‌కుముందు గుజరాత్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, బీహార్ సీపిఎం ఎమ్మెల్యేలు కూడా సంకెళ్లతోనిరసన తెలిపారు. భారతీయులను అవమానించిన అమెరికా తీరుపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు.

